లేవగానే మొహం కడుక్కుని కాఫీ తాగి స్నానం చేయడానికి వెళ్ళింది. మంచంమీద పక్క కూడా సర్దలేదు. ఫోటో ఉంటే మంచంమీద ఉండాలి! లేదా ఆ క్రిందే ఎక్కడో పడి ఉండాలి. కానీ ఫోటో ఎక్కడా లేదు.

సందేహం లేదు.... తను స్నానం చేస్తున్నప్పుడు నాగరాజు గదిలోకి వచ్చాడు. ఆ ఫోటో నాగరాజు కంటపడి ఉండాలి? దాన్ని తీసుకుని వెళ్ళిపోయి ఉంటాడు. కానీ నాగరాజుకు ఆ ఫోటోతో ఏం పని?

'పోనీ కాస్త బోర్నవీటా అయినా తీస్కోండమ్మా.....' అన్నాడు రామయ్యా.

రామయ్యా     మాటలకి సరోజ ఆలోచనలకి బ్రేక్ పడింది.

'వద్దు రామయ్యా. అర్జంటుగా బయటికి వెళ్ళాలి!' చెప్పుల్లో కాళ్ళు దూరుస్తూ అంది సరోజ.

పోలీసు స్టేషనులో అడుగు పెట్టిన సరోజ అక్కడ నాగరాజుని చూసి ఆశ్చర్యపోయింది.

***చిక్కుల్లో రాంబాబు***

నాగరాజు అక్కడ ఎందుకున్నాడు.

సరోజ మనసు కీడుని శంకించింది.

సరోజని చూసిన నాగరాజు వంకరగా నవ్వాడు.

ఇన్స్పెక్టర్ శ్రీరామ్ నిటారుగా కూర్చున్నాడు.

'రండమ్మా రండి..... ఏంటి మీ కంప్లెయింట్ ఎవరైనా టీజ్ చేస్తున్నారా? చెప్పండి..... వాడిని షూట్ చేస్తాను.' అన్నాడు. శ్రీరామ్ రివాల్వర్ తీస్తూ.

'అటువంటిదేమీ కాదండీ..... అంతకంటే గొప్ప కష్టం వచ్చిందండి......' అన్నడు కిష్టయ్యా ముందుకి వస్తూ.

కిష్టయ్యాని చూస్తూనే మొదట శ్రీరామ్ ఉలిక్కిపడ్డాడు. తరువాత కుర్చీలోంచి లేచి అటెన్షన్లో నిలబడి కిష్టయ్యాకి రివాల్వర్ గురిపెట్టాడు.

'చెప్పు ..... ఎక్కడ? రాంబాబెక్కడ?' ఇంట్లో ఉన్నాడా ఎక్కడి కైనా వెళ్ళాడా?' కంగారుగా రివాల్వర్ పక్కలకి ఊగిస్తూ అన్నాడు.

కిష్టయ్యా ఆశ్చర్యంగా చూశాడు.

'అదేంటి సార్..... గురూగారి గురించి కంప్లెయిట్ ఇద్దామనే మీ దగ్గరకి వచ్చాం.....'

'అవునండి..... ఆయన ఎక్కడున్నా మీరు వెతికి పట్టుకోవాలి!' అంది సరోజ.

'ఓ...... అయితే పారిపోయాడన్నమాట..... మీరు కంప్లెయింట్ చేయకపోయినా మేము రాంబాబుని వెతికి పట్టుకుంటాం..... అది మా బాధ్యత.....' అన్నాడు శ్రీరామ్.

'థాంక్సండీ ......' అంది సరోజ.

'థాంక్స్ ఎందుకు ..... చెప్పానుగా అది మా బాధ్యత అని..... తరువాత రాంబాబుని ఉరికంబం కూడా ఎక్కిస్తాం......'

కిష్టయ్య కంగారుపడిపోయాడు.....'అదేంటండీ .....ఆయన ఆత్మహత్య చేస్కుని చావకుండా ఆపమని మిమ్మల్ని అడగడానికొస్తే మీరు ఆయన్ని ఉరికంబం ఎక్కించి చంపుతామని అంటారేం?'

'ఆత్మహత్య చేస్కోడం ఏమిటి?'

'అవును సార్..... గురూగారూ ఆత్మహత్య చేస్కుందామని ఇంట్లోంచి వెళ్ళిపోయారు.....'

'ఆత్మహత్య చేసుకోడానికి కదు....హత్య చేశాడు కదా..... అందుకనే పారిపోయాడు.....'

సరోజ, కిష్టయ్య ముఖముఖాలు చూస్కున్నారు.

'హత్య అంటున్నారేమిటి?' ఇద్దరూ ఒకేసారి అడిగారు.

శ్రీరామ్ డ్రాయర్ సొరుగులోంచి ఫోటో తీసి చూపించాడు.

అది రాంబాబు కౌగిట్లో నీలిమ వున్న ఫోటో!!.....

*ఫ్రేమ్ - 23*

***రాంబాబు కోసం వేట***

సరోజకి సంగతి అర్ధమైంది. ఆమె కోపంగా నాగరాజు వంక చూసింది.

నాగరాజు గర్వంగా సరోజవంక చూశాడు.

'దీనిబట్టి ఏ మర్ధమవుతుందంటే....నీలిమకీ రాంబాబుకీ అక్రమ సంబంధం ఉంది..... కొన్నాళ్ళ తరువాత రాంబాబుకి నీలిమ మీద మోజు తీరిపోయి ఉండి ఉండాలి ..... రాంబాబు నీలిమని పట్టించుకుని ఉండడు. ఆమె గొడవ చేసి ఉండాలి!'

ఒక్కసారిగా గబగబా మాట్లాడిన శ్రీరామ్ పీల్చుకోవడం కోసం ఆగాడు.

కిష్టయ్యకి సరోజకీ నోట మాట రాలేదు. రాంబాబుమీద ఈ విధంగా హత్యనేరం మోపబడుతుందని ఊహించనేలేదు!.....

మీరు చెప్పింది అక్షరాల నిజం ఇన్‌స్పెక్టర్.....' అన్నాడు నాగరాజు శ్రీరామ్‌ని సపోర్టు చేస్తూ.

'మొన్నటి పేపర్ చూశారా?' శ్రీరామ్ సరోజవంక చూస్తూ అడిగాడు.

సరోజ చూడలేదన్నట్లు తల అడ్డంగా ఊపింది.

'ఎవరో ఒకమ్మాయిని రేప్‌చేసి తరువాత చంపేసి ఊరుచివర పారేశారు....బహుశా ఈ హత్య కూడా రాంబాబే చేసి ఉండవచ్చు...... అతను సెక్స్ మానియాక్‌గా మారి ఉండవచ్చు!....అన్నాడు శ్రీరామ్.

కిష్టయ్య గుండెలు బాదుకున్నాడు.

'బాబోయ్ ఆయన అలాంటివారుకాదు సార్..... ఆడపిల్లల మొహం వంక సూటిగా చూడ్డానికి కూడా భయపడ్తారు సార్. అటువంటి మనిషి రేప్ ఎలా చేస్తాడు సార్?.....'

'కళ్ళు మూస్కుని చేస్తాడు.'

'చాలా చక్కగా చెప్పారు.....' అన్నాడు నాగరాజు శ్రీరామ్‌ని మెచ్చుకుంటూ.

'అదికాదుసార్..... అసలు ఆ ఫోటో ఎలా వచ్చిందంటే.....' కిష్టయ్య ఎక్స్‌ప్లెయిన్ చెయ్యబోయాడు.

'మేము నేరస్థుల్ని పట్టుకోడం, వాళ్ళు మాకు కట్టుకథలు చెప్పడం మాకు అలవాటే.... ఇంకా ఎక్కువగా మాట్లాడావంటే హత్య చెయ్యడంలో రాంబాబుకి తోడ్పడ్డావని నిన్నూ మూసేస్తాం.....'

ఇంక ఏమి చెప్పినా వాళ్ళు వినరని కిష్టయ్యకీ సరోజకీ అర్థం అయింది. కాలయాపనకి అది సమయంకాదు. అవతల రాంబాబు ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లాడు. అతన్ని ఆత్మహత్యా ప్రయత్నంనుంచి ఆపాలి.

'పోనీ రాంబాబే ఈ నేరం చేశాడని అనుకుందాం. ఆయనకి జైలు శిక్ష వేయించడానికి ఆయన్ని వెతికి పట్టుకోవాలికదా.....దయచేసి వెంటనే మీ జీపులో బయలుదేరి ఆయన్ని వెతకండి..... ఆయన దొరికాక నేరం ఆయన చేశాడో లేదో కనుక్కోవచ్చు....' సరోజ శ్రీరామ్‌ని బతిమలాడింది.

'మీరా విషయం చెప్పాలా?..... రాంబాబుని తప్పకుండా వెతికి పట్టుకుంటాం.....' అన్నాడు శ్రీరామ్ గర్వంగా.

'ఎప్పుడు?' సరోజ ఆతృతగా అడిగింది.

రేపో ఎల్లుండో .... వీలైనంత త్వరగా ..... అతను మానుండి ఎక్కడికి తప్పించుకుని పోతాడు షూట్ చేసేస్తాను.....'

కిష్టయ్య తల పట్టుకున్నాడు.

'మీరు రేపో ఎల్లుండో అంటే అతను మనకి దక్కడు. ఆయన ఆత్మహత్య చేస్కోడానికి వెళ్ళాడంటే మీరు వినరేంటిసార్?'

'అతను ఆత్మహత్య చేస్కోడానికి వెళ్ళాడని మీరెందుకు అనుకుంటున్నారు? అలా అని ఉత్తర్మేమైనా రాసిపెట్టి వెళ్ళాడా?'

'లేదండీ.... ఆయన నల్లచొక్కా, పాంటు వేసుకుని నన్ను దగ్గరకు తీస్కుని ఒళ్ళు నిమిరి, నా నొసలు మీదముద్దు పెట్టుకుని రేగిన జుట్టుతో శూన్యంలోకి చూస్తూ వెళ్ళిపోయారండీ....' అన్నాడు కిష్టయ్య బాధగా.

అయితే ఇది ఆలోచించాల్సిన విషయమే!.....'

'త్వరగా పదండిసార్ ...... మీరతన్ని త్వరగా పట్టుకుని జైలుశిక్ష వేయిస్తే మీకు మంచిదిగానీ మీరు ఆయన్ని పట్టుకోకముందే ఆయన ఆత్మ హత్యచేసేస్కుంటే నేరస్తుల్ని పట్టుకోవడంలోని మీ ప్రతిభని మీరెలా నిరూపించుకోగలరు సార్?.....'

'యూఆర్ రైట్ .... ఏయ్ నూటపదకొండూ ..... వెంటనే జీప్ సిద్దం చేసిరా ' అరిచాడు శ్రీరామ్.

'ఎస్ సార్?'

జీపులో శ్రీరామ్, ఇద్దరు కానిస్టేబుళ్ళూ సరోజ, కిష్టయ్య, నాగరాజు బయలుదేరారు.

## *మరోసారి ప్రమాదం*

రాంబాబు పరుగెత్తుతున్నడు.

అతనికి ఆయాసం బాగా వస్తూంది. ఒళ్ళంతా చెమట పట్టేసింది. కాళ్ళలోకి సత్తువ తగ్గిపోతూంది.

అయినా పరుగెత్తాలి....తప్పదు.

సందు చివరిదాకా పరిగెత్తి వెనక్కి తిరిగిచూశాడు.

జగ్గూ, వీరూ భారీ శరీరాల్ని అతికష్టం మీద మోస్తూ పరుగెత్తుకుంటూ వస్తున్నారు.

సందు తిరిగి మరికాస్త వేగం పెంచాడు రాంబాబు.

'శనిగాళ్ళు......ఆత్మహత్య చేస్కుందామని ఇంటినుండి కాస్తదూరం వచ్చానో లేదో.....ఈ వెధవలు తగిలి వెంబడించడం మొదలుపెట్టారు...... ఇప్పుడు వీళ్లని వదించుకోడం ఎలా?.....' అనుకున్నడు రాంబాబు.

రాంబాబు కళ్లలో సత్తువ పూర్తిగా తగ్గిపోయింది. అప్పటికి దాదాపు గంటదాకా జగ్గూ, వీరులతో దాగుడుమూతలు ఆడ్తూ పరుగెత్తుకుంటూ తప్పించుకుంటూ అవస్థలు పడ్తున్నాడు రాంబాబు. ఇంక అతను పరుగెత్తలేడు...... ఏదో ఒకటి చెయ్యాలి!

అతనికి కాస్తదూరంలో ఒక కిళ్ళీషాపు కనిపించింది.

రాంబాబుకి ఒక ఆలోచన వచ్చింది. వెనక్కి తిరిగి చూశాడు. జగ్గు, వీరూ సందుతిరిగి ఇంకా ఇటువైపు రాలేదు.

రాంబాబు కిళ్ళీషాపు దగ్గర ఆగాడు.

'బాబూ..... డక్కన్ క్రానికల్ పేపర్ ఒకటివ్వు' అడిగాడు రాంబాబు.

'క్రానికల్ లేదుసార్..... అయిపోయింది' చెప్పాడు షాపువాడు.

'క్రానికల్ లేకపోతే ఏదో ఒకటి ఇవ్వు'

'ఇంగ్లీషు పేపర్లు లేవుసార్'

'ఇంగ్లీషు పేపరు లేకపోతే తెలుగుది, అదీ లేకపోతే హిందీ పేపరు .....ఏదో ఒకటి త్వరగా ఇవ్వు అసలే టైంలేదు....' కంగారుగా అన్నాడు రాంబాబు సందు మొదలువైపు చూస్తూ.

కిళ్ళీషాపువాడు రాంబాబువైపు వింతగాచూస్తూ పేపరు తీసిఇచ్చాడు. రాంబాబు డబ్బులు ఇచ్చి పేపరుని కంగారుగా మొహానికి అడ్డుగా పెట్టుకుని నిల్చున్నాడు.

కిళ్ళీషాపువాడికి చాలా ఆశ్చర్యం వేసింది. వాడు ఆషాపుపెట్టి దాదాపు పది సంవత్సరాలయింది. ఈ పదిసంవత్సరాల కాలంలో ఎవరూ వార్తలని అంత అర్జంటుగా చదవడం చూడలేదు.

రాంబాబు పేపర్ని మొహానికి ఇలా కప్పుకున్నాడో లేదో సందు మొదట్లో జగ్గూ, వీరు ప్రత్యక్షమయ్యారు. ముందుకు పరుగెత్తుకువచ్చిన వాళ్ళిద్దరికీ కనుచూపు మేరలో రాంబాబు

కనిపించలేదు. వాళ్ళా ఆశ్చర్యానికి అంతులేదు.

అది తిన్న నైనరోడ్డు. ప్రక్క సందులు కూడాలేవు. మరి రాంబాబు ఏమైనట్టు?.....

వాళ్ళు పరుగెత్తుతూ వచ్చి కిళ్ళీషాపుకి ఎదురుగా ఆగిపోయారు. 'ఇంతలో ఏమైపోయాడబ్బా' అన్నాడు వీరూ గుండుని చేత్తో రుద్దుకుంటూ .

'ఇక్కడే ఎక్కడో దాక్కుని ఉంటాడు. మనం వెళ్ళిపోయాక మెల్లగా బయటికి తప్పించుకుంటాడు.....' అన్నాడు జగ్గూ మీసాలు మెలితిప్పుటూ.

రాంబాబుకి వాళ్ళిద్దరి మాటలూ వినిపిస్తూనే వున్నాయ్. వణుకుతున్న చేతులోత పేపరుని అలానే మొహానికి అడ్డుగా పెట్టుకుని నిల్చున్నాడు. 'వాడు బయటికి వచ్చేదాకా మనం ఇక్కడే నిల్చుందాం.......వాడిమీద పగతీర్చుకోందే నాకు నిద్రపట్టదు...నా ప్రొబేషన్ ఎక్స్ టెండ్ చేయించాడు కదు?' అన్నాడు వీరూ వీరావేశంతో గుండుని రివ్వురివ్వుమని రుద్దుకుంటూ.

'మనం ఇక్కడే ఇలా నిల్చుంటే వాడు బయటికిరాడు..... వాడికి మనం కనిపించకూడదు'

'ఎలా?' అన్నాడు వీరూ.

'రా చెప్తాను ......... ' అన్నాడు జగ్గూ కిళ్ళీ షాపువైపు అడుగులు వేస్తూ.

రాంబాబు గుండె దడదడలాడింది.

'ఒరేయ్.....ఓ న్యూస్ పేపరివ్వరా.....' అన్నాడు జగ్గూ కిళ్ళీ షాపువాడితో.....

'ఏ పేపరు?' అడిగాడు వాడు.

'ఏదైనా ఫరవాలేదు'

'ఇంగ్లీషా, తెలుగా?'

'చెప్పానుకదా బే..... ఏదైనా ఫరవాలేదని?'

వాడు ఆశ్చర్యంగా చూస్తూ ఓ తెలుగు న్యూస్ పేపర్ ఇచ్చాడు.

'డబ్బులు .....' అంటూ గొణిగాడు.

'డబ్బులెందుకురా.... కాస్సేపయ్యాక నీ పేపరు నీకు ఇచ్చేస్తాం' అన్నాడు వీరూ గుండు రుద్దుకుంటూ.

జగ్గూ మధ్య పేజీలుతీసి వీరూకి ఇచ్చాడు.

'మొహం కనపడకుండా ఈ పేపర్లు అడ్డుపెట్టుకుని రోడ్డుమీద రాంబాబు కనిపిస్తాడేమో జాగ్రత్తగా గమనిస్తూ ఉండు.....'

ఇద్దరూ మొహాలకి పేపర్లు అడ్డుగా పెట్టుకుని నిల్చున్నారు. వాళ్లకి కేవలం నాలుగు గజాల దూరంలోనే రాంబాబు మొహానికి పేపరు అడ్డుపెట్టుకుని నిల్చుని వున్నాడు.

కిళ్ళీషాపువాడు వీళ్ళవంక ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నాడు.

రాంబాబు మనసులో ఎన్నో ఆలోచనలు!....

వీళ్ళని ఎలా తప్పించుకోవడం? చూస్తుంటే తనని పట్టుకునేదాకా వదిలేలా లేరు.

ఇప్పుడు తనని చూశారంటే చంపేస్తారు!.....